# నిరుద్యోగ పర్వం

**రావి కొండలరావు**

బి. యే. పాసయినతర్వాత రామ్మూర్తి ఏం చేస్తాడని పట్టుకున్నది. బి. యే. పాస్ కావాలని రామ్మూర్తి పెద్దలంతా కోరినట్టే అతనుకూడా పాసయి కూచున్నాడు.

ఐతే రామ్మూర్తి తర్వాత ఏం చెయ్యాలి?- రామ్మూర్తి తండ్రి స్కూల్లో టీచరు వుద్యోగంచేస్తూ పాతికేళ్ళయి గడుపు కొస్తున్నాడు.

"బియ్యేడీకి పోతేనో?" అన్నది రామ్మూర్తి తల్లి.

"ఏమన్నా చెయ్యనీ కానీ-వాడిని మరి బడిపంతులు వుద్యోగంమాత్రం చెయ్యనివ్వను. పాతిక సంవత్సరాలై నేను అందులో నేపడి ఏడుస్తున్నా-ముక్తి మోక్షం దొరకటంలేదు. బడిపంతులు వుద్యోగం ఎందుకూ పనికిరానివాడు చెయ్యాల్సిందని నా వుద్దేశం!" అని రామ్మూర్తి తండ్రి ప్రకటించాడు.

రామ్మూర్తికి ఒకవుద్దేశం అంటూ ప్రత్యేకించి ఏమీ కనిపించటంలేదు. అతని దృష్టికి స్కూలుటీచరు వుద్యోగం మంచిదేనని వున్నట్టు తోచింది. సంవత్సరం పొడుగునా సెలవలూ-పెద్దగా చిరాకుపుట్టించేపని కాకపోవటం-పదిమంది కుర్రాళ్లు గౌరవంగా నమస్కారాలు పెడుతూ వుండటం-ఇటువంటివి రామ్మూర్తికి మంచివిగానే తోచినై. ఐతే తండ్రిమాత్రం ఆ వుద్యోగం ఎందుకొద్దంటున్నాడో అతనికి అర్థంకాలేదు.

"ఇంతకూ నన్నేంచెయ్యమని నీ వుద్దేశం?" అన్నాడు తెగించి రామ్మూర్తి తండ్రితో.

"ఏం చేస్తావు? వేరే వుద్యోగాలకోసం చూస్తావు. మీనమేషాలు లెక్కపెడుతూ కూచోక, పత్రికల్లోనో ఎక్కడో చూస్తూ ఎక్కడెక్కడ ఏమేం ఖాళీగావుంటున్నయ్యో చూసుకో. కొస్తగవర్నమెంటులో పడివుంటే, ఎప్పటికన్నా మెరుగే. ప్రమోషనులూ-ఇంక్రిమెంటులూ - ఆఖరుకు రిటైరయితే ఇంత పింఛనుకూడా పారేస్తారు!"

రామ్మూర్తి వార్తాపత్రికలు గాలించసాగించాడు, సర్టిఫికేట్లు సంపాయించాడు. దరఖాస్తులు పంపుతున్నాడు!

ఇంతలో ఎక్కడినుంచో రామ్మూర్తి మేనమామ కలగజేసుకున్నాడు.

"ఎందుకురా ప్రతీవాడికీ గవర్నమెంటు వుద్యోగాలు? కలకాలం గుమస్తాగా పడివుండాల్సిందేగా. ప్రమోషనా - వల్లకాడా? నిత్యం ఆ బల్లదగ్గిర కాయితాలు రాయటం తప్ప పదిమందిలోనూ గౌరవమూ - పేరా - ప్రఖ్యాతా? నామాటే చూసుకో. తెల్లవారి లేచి ఆరోగంటకు ఆఫీసుకు పోతాను. సాయంత్రం ఏ ఏడెనిమిది గంటలకో తెముల్చుకుని ఇంటికి వస్తే అదృష్టవంతుడినే. గంతలుకట్టిన గానుగెద్దులాగా జీవితాంతం చెయ్యాల్సినపనే యిది! సాయంత్రం కాస్సేపు సరదాగా తిరుగుదామంటే ఈజీవితం నోచుకోలేదు. ఇంత చచ్చినా ఆ జీతంరాళ్లు నూటపాతిక దాటవు. ఈ సంసారం అప్పులతోనే నడుస్తున్నది. ఇదెట్లా తీరుతుందో రుద్రుడికే తెలీదు. గుమస్తాగిరీ మాత్రం చెయ్యకు. ఐనా నీవంటివాడికి గుమస్తా ఖర్మం ఏంరా?—నిక్షేపంవంటి తెలివితేటలున్నయ్ - బోలెడన్ని కథలు రాశావు - ఏ పత్రిక ఆఫీసులోనో నువ్వు వూఁ అంటే ఏ సబ్ఎడిటర్ వుద్యోగమో పారేస్తారు. నామాటవిని ఆ పనిచెయ్యి. కీర్తికి కీర్తి-ఎంతలేదన్నా రెండువందలుదాటి తెచ్చుకుంటావు. అటువంటిదాల్లో వుంటే పైకిరాగల లక్షణాలు నీలో వున్నై గనుక చెబుతున్నాను. ఇటువంటి పనులు చెయ్యగలిగే శక్తికలవాళ్లు లోకంలో తక్కువ. గుమస్తాకేం - ప్రతీవాడూ పనికొస్తాడు" అనే ధోరణిలో ఆయన ఉత్తరం రాశాడు.

రామ్మూర్తికి ఇది బాగానే కనిపించింది. నాలుగయిదు పత్రికా కార్యాలయలకు దరఖాస్తులు పెట్టాడు. మరోచిత్రం ఏమిటంటే రామ్మూర్తికి నాటకాల సరదావుంది. చదువుకునేరోజుల్లో చాలాసార్లు బడిలోనూ కాలేజీలోనూ నాటకాల్లో వేషాలు వేశాడు. కొన్ని బహుమానాలు కూడా సంపాయించాడు! ఇది ఆధారంగా తీసుకుని రామ్మూర్తి స్నేహితులు కొందరు అతన్ని సినిమాపరిశ్రమలో జేరమన్నారు. చదువుకున్నవాడూ- సంస్కారం, రూపం రెండూవున్నవాడూ అరుదు అన్నారు. పైగా నాటకాల్లో చచ్చేంత అనుభవం వుందన్నారు!

రామ్మూర్తికి ఈ సలహాకూడా నచ్చింది. ఐతే అతను దేనికీ ఛటాలున నిర్ధారణకు రాలేకపోతున్నాడు!

తన మేనమామ రాసిన విషయాన్నీ, స్నేహితులు యిచ్చిన సలహాలనూ రామ్మూర్తి ఆలోచించి తండ్రితో చెప్పాడు—

"ఇక్కడ వుండి ఈ పత్రికా కార్యాలయాలకు వుత్తరాలు రాయటం ప్రయోజనకరంగా కనిపించటంలేదు. ఏ సినిమాడైరక్టరునో కలుసుకుని అతినిదగ్గర అసిస్టెంటుగా వుండటానికి అడగనూవచ్చు - పత్రికాధిపతులను కలవనూవొచ్చు. నేను అనే దేమిటంటే ఒకటిరెండు నెలలు మద్రాసులోవుండి ప్రయత్నంచేదామని!"

ఈ వ్యవహారం రామ్మూర్తి తండ్రికి నచ్చలేదు. ఆయన ఇదంతా కొట్టిపారేశాడు. కాని, రామ్మూర్తి తల్లీ, రామ్మూర్తి స్నేహితులూ, బంధువులూ, పైగా మేనమామా- వీళ్లంతా అతన్ని మద్రాసుకు పంపటం వుత్తమం అని సలహాలివ్వటం సాగించారు. ఆఖరుకు రామ్మూర్తిని మద్రాసు పంపాలనే నిర్ధారణకు రావటానికి అతని తండ్రికి నెలరోజులుపట్టింది!

రామ్మూర్తి మద్రాసు చేరాడు. చేరుతూనే ఒక పత్రికాకార్యాలయంలోకి ప్రవేశించి తననుగురించి పరిచయంచేసుకుని- తన అభిలాష వ్యక్తంచేశాడు. "మా ఆఫీసులో వుద్యోగాలేం లేవే! ఐనా ఒకసారి మా ప్రొప్రయిటర్ గార్ని చూడండి!" అన్నాడు రామ్మూర్తి చెప్పినదంతా విని ఒకాయన. రామ్మూర్తి ప్రొప్రయిటర్ను చూడటానికిపోతే ఆయన అక్కడలేడు!

"లేరండీ" అన్నాడు రామ్మూర్తి తిరిగి వచ్చి.

"సరే-వొస్తార్లెండి." అని ఆయన, "ఏం పాసయానన్నారు?" అని ప్రశ్నించాడు.

"బియ్యే."

# నిరుద్యోగపర్వం

ఆయన కొంచెం ఆలోచించి "పెద్దవాడినిగా ఒక సలహా యివ్వమంటారా?" అన్నాడు.

తప్పకుండా ఇవ్వమన్నాడు రామ్మూర్తి కళ్లు పెద్దవిచేస్తూ.

"బియ్యేపాసయారు కాబట్టి మీకు ఇంకో వుద్యోగం దొరకదనే భయం లేదు. జర్నలిజంలో పడి బాగుపడినవాడు ఇంతవరకూ లోకంలో లేడు. జర్నలిజం అనేటప్పటికి ప్రతివాడికీ కొన్ని వూహలుంటాయి.. నిజమే. తీరా ఈ ప్రపంచంలో పడేసరికి అవేవీ పనిచెయ్యవు. 'ఇక్కడ కూచుని అవీయివీ రాయటంతప్ప-స్వంత' అభిప్రాయాలకు ఇక్కడ అంత చోటు కూడా వుండదు. పాతిక సంవత్సరాలుగా నేను ఇక్కడే పనిచేస్తున్నాను. మొదట్లో ఎన్నో కష్టాలు పడవలసివచ్చింది. ఒక స్టేజిలో ఈ వుద్యోగం మానేసి ఇంకో వుద్యోగానికి పోదామని 'కూడా అనిపించింది. కాని. ఆదర్శంగా మొదట్నుంచీ పెట్టుకుని తలదూర్చినతర్వాత కష్టాలు అనుభవిస్తే అనుభవిస్తాం అని వుండిపోయాను. మీరు ఇంకా కుర్రాళ్ళు. ఇంకా జీవితం అంటే ఏమీ తెలీదు. మనసులో ఏవేవో వూహలు పెట్టుకుని చేదామనే వుత్సాహంతో వుంటారు. ఇక్కడేమీ లాభంలేదు. నేనేదో నిరుత్సాహపరుస్తున్నానని, 'మధ్య విడిచెందుకు' అనీ అనుకోకండి. మొదట్నుంచీ యిందులో వుండి సాధకబాధకాలు అనుభవిస్తున్నాను కాబట్టి చెబుతున్నాను. ఆ తర్వాత మీ ఇష్టం! ముందుకు రావలసిన వాళ్ళకూ నాలుగురాళ్లు వెనకేసుకునేందుకూ మాత్రం ఇది చోటు కాదు!" అన్నాడాయన.

రామ్మూర్తికి నోరువిడలేదు - తన మేనమామ మాత్రం చటాలున గుర్తొచ్చాడు!

పత్రికా కార్యాలయంనుంచి బయట పడ్డాక రామ్మూర్తి చాలా ఆలోచించాడు. ఈ వుద్యోగ ప్రయత్నాలు అతనికి చాలా అవకతవకగా కనిపించినై. ఎక్కడకు పోయినా ఎదురే కనిపిస్తున్నది. తండ్రీ, మేనమామా, పత్రికా కార్యాలయంలోని ఒక సంపాదకుడూ-వీళ్ళ ముగ్గురికీ అభిప్రాయాలలో చాలా భేదాలు కనుపిస్తున్నయ్. ఆ 'భేదాలు' ఎందుకొస్తున్నయ్యో అని రామ్మూర్తి తల పగలగొట్టుకున్నాడు.

నాలుగురోజులు తిరగ్గా రామ్మూర్తికి ఒక సినిమా డైరక్టరు దర్శనం లభించింది.

"నమస్కారం" అన్నాడు రామ్మూర్తి.

"మీ పేరు" అన్నాడు దర్శకుడు.

"మూర్తి" అని బదులు చెప్పాడు 'రామ్మూర్తి' అనేపేరు తనకే అసహ్యంగా తోచి. అదీగాక, సినిమాపరిశ్రమలో 'రామ్మూర్తి' అనేపేరు పనికిరాదనీ, దాన్ని 'మూర్తి' చెయ్యాలనీ అతను భావించాడు.

డైరక్టరు ఆప్యాయంగా చాలాప్రశ్నలు వేశాడు. అన్నింటికీ రామ్మూర్తి జవాబిచ్చాడు.

"సరే ఐతే-ప్రస్తుతం అన్ని వేషాలకూ మనుషులను ఏర్పాటుచేసేశాం. పోతే, నాకు అసిస్టెంట్లు నలుగురున్నారు. ఇద్దరికి అసలు పనిపాటూకూడా లేదు! ఏవన్నా వేషాలురాగానే కబురుచేస్తాను-మీ అడ్రసు ఆఫీసులో ఇచ్చి వెళ్లండి!" అనేసి ఆయన నిష్క్రమించాడు.

'థాంక్స్' అనుకున్నాడు రామ్మూర్తి మనసులో.

ఆఫీసులో చూడగా-ఆగదిలో ఒక ముసలాయనతప్ప ఇంకెవరూ కనిపించలేదు. ఆయన ఏవో లెక్కలు చేసుకుంటున్నట్టు కనిపించాడు. తన అడ్రస్ కాగితంమీద రాసి ఇచ్చాడు ఆయనకు.

"ఇంతసేపూ డైరెక్టరుగారితో మాట్లాడుతున్నది మీరేనా?" అన్నాడాయన కళ్ళజోడు తీసి బల్లమీద పెడుతూ.

"అవును."

"కూచోండి."

రామ్మూర్తి ఉత్సాహంగాకూచున్నాడు.

"నేనోమాట చెబుతాను వినండి. మీరు అన్యథా భావించకండి. బాగుపడదామనుకునే వాళ్ళకూ, సుఖపడదామనుకునే వాళ్ళకూ ఈ ఇండస్ట్రీలో స్థానంలేదు. ఇక్కడ కావలసింది ఇంకోటి! మీరు బియ్యే పాసయారా యమ్మే పాసయారా అక్షరం ఇక్కడ అక్కర్లేదు. ఇక్కడసలు తెలివితేటలున్నవాళ్లు పనికిరారు. 'నేను తెలివైనవాడిని' అని చెబితే ఇక్కడ ఉద్యోగం రాదు. 'నేను వెధవను' అనే ధోరణిలో చెప్పాలి. ఈయనేదో వేషం ఇస్తాడనే ఉద్దేశంలో మీరుండి - రోజూ ఆశగా ఎదురుచూస్తారు. పిక్చరు పూర్తయిపోతుంది. మీకు వేషమూరాదు - ఏమీరాదు. అవన్నీ వట్టికబుర్లు. ఈ పరిశ్రమలో నాకు పదిహేను ఏళ్లయి అనుభవంవుంది. మొదట్లో అసిస్టెంటు డైరెక్టరుగా వుండేవాడిని. డైరెక్టరును ఐపోతానని కలలుగన్నాను. ఎనిమిది పిక్చర్లకు అసిస్టెంటుగా పనిచేశాను. ఎవడికీ మనమీద కనీసం గౌరవమన్నా లేదు. ఆఖరుకు అసిస్టెంటుకుకూడా నేను పనికిరాను పొమ్మన్నారు. ఈ ఆఫీసులో పడ్డాను. గంపెడు సంసారం. అంతాబాధ. ఈ పరిశ్రమలోకి మాత్రం రాకండి - ఎందులోనన్నా పని చెయ్యండి. నైతికంగాకూడా మనుషులు చెడిపోయేవాళ్లున్నారు. మనం ఏదానికీ మాటాడటానికి వుండదు. సలహాయివ్వబోతే పనికిరాదు! స్వానుభవం నాయనా స్వానుభవం!" అన్నాడు ముసలాయన తన ఆవేదనంతా రామ్మూర్తిముందు వెళ్ళగక్కుతూ.

రామ్మూర్తికి కళ్లుతిరిగాయి. నిరుత్సాహముగా లేచాడు; మారుమాటాడకుండా బయటపడ్డాడు.

అంతా కార్లూ- బస్సులూ రొదగోల. ఆ గోలమధ్యలోపడ్డాడు. అతనికి తల తిరిగిపోతున్నది. ఎవరి ఉద్యోగాన్ని వాళ్లెందుకు ఇట్లా తిట్టుకుంటున్నారో అతనికి అర్థంకాలేదు. ఐతే తనేంచెయ్యాలి? తనతండ్రికి బడిపంతులు ఉద్యోగం నరకం! ఇంకోడికి స్వర్గం—మేనమామకు అతని ఉద్యోగం నరకం—పత్రికలో వుద్యోగం స్వర్గం! ఇంకోడికి అది నరకం!...వాళ్లుచేసే ఉద్యోగాలు కాక...ప్రతివాడికీ ఎదటివాడి వుద్యోగం-ఎండమావుల్లాగా కనిపిస్తున్నదా! ఆత్మలను చంపుకుని వీళ్లంతా ఎందుకు చేస్తున్నారు ఆ ఉద్యోగాలు? ఈ భేదాలు ఎందుకొచ్చినై?—

ఏం చెయ్యాలి తను?—

ఎందులో చేరాలి?—

తనభవిష్యత్తు ఏమిటి?—

తల పైకెత్తి రామ్మూర్తి ఆకాశంవంక చూశాడు. శూన్యం తప్ప మరేమీ కనిపించలేదు!! ★

కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును.చింతఅనవసరం
సెం (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగు ప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.
స్టాకిస్టు: Indo Medical supplies
No. 3 Pauliappan st. Seven wells
Madras-1.

వైటోడెంట్
దంతక్రిములను
సంహరించే పండ్లపొడి
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్. మదరాసు-3